VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

గురువారం 25 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.277




2 లో

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు వెల్లడి

## బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

అంతర్జాతీయ ప్రభావంతో దిగివచ్చిన రేట్లు



2 లో

## రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తా!

హామీలు అమలు చేస్తే ఎమ్మెల్యేగా రాజీనామా

మళ్లీ ఎన్నికల్లో పోటీ కూడా చేయను

సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి

2 లో

రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు.



## సుప్రీం దెబ్బతో దిగివచ్చిన పతంజలి



**క్షమాపణలు కోరుతూ భారీ ప్రకటనలు**

**న్యూఢిల్లీ:** పతంజలి ప్రకటనల వివాదంలో సుప్రీం ఆదేశాలతో దిగివచ్చింది. భారీ ప్రకటనను ఇచ్చి క్షమాపణలు కోరింది. ఎన్నిసార్లు మందలించినా తీరు మార్చుకోవడం లేదంటూ సుప్రీంకోర్టు ఇప్పటికే అక్షింతలు వేసింది. ఆ తరవాత రామ్‌దేవ్ బాబాతో పాటు ఆచార్య బాలకృష్ణ స్పందించారు. కోర్టుకు క్షమాపణలు చెప్పారు. అయితే...పేపర్లలో పతంజలి ప్రకటనలు ఏ సైజ్‌లో అయితే వేస్తారో అదే సైజ్‌లో క్షమాపణలు చెబుతూ ప్రకటనలు వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే ఓ రోజు యాడ్స్ వేసిన పతంజలి వరుసగా రెండోరోజూ ప్రకటన ఇచ్చింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు అందరినీ క్షమాపణలు కోరుతున్నట్టు అందులో పేర్కొంది. 'ఇప్పటి వరకూ మా ప్రకటనల్లో వచ్చిన తప్పులకు క్షమాపణలు కోరుతున్నాను. ఇలాంటి పొరపాటు మళ్లీ జరగకుండా జాగ్రత్తపడతాం. ఇకపై నిబద్ధతగా ఉంటాం అని పతంజలి ప్రకటించారు. సుప్రీంకోర్టు దెబ్బకి దిగొచ్చిన పతంజలి, క్షమాపణలు కోరుతూ న్యూస్‌పేపర్‌లలో భారీ ప్రకటనలు చేసింది.



## ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

**సూర్యాపేట:** కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొట్టడంతో అందులో ఉన్న ఓ చిన్నారితో సహా ఆరుగురు చనిపోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో కారులో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. ఆరుగురు ఘటనాస్థంలోనే చనిపోయారు. గాయపడిన ఇద్దరిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

# భయపడకపోతే కాళేశ్వరంపై చర్చిద్దాం.. రండి

ప్రాజెక్టు వద్దకు రావాలని కేసీఆర్‌కు

సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

పంద్రాగస్టులోపే రుణమాఫీ చేస్తామని వెల్లడి

హరీశ్‌రావు రాజీనామా పత్రం సిద్ధంగా పెట్టుకోవాలి

మతచిచ్చు రేపడమే భాజపా లక్ష్యం

వరంగల్ సభ, సికింద్రాబాద్ రోడ్‌షోల్లో సీఎం



"కాళేశ్వరానికి పోదాం. అక్కడే కూర్చుందాం. నిపుణులను పిలిపిద్దాం. తెలంగాణ సమాజం వస్తుంది. మీకు దమ్ము, ధైర్యం, నీతి, నిజాయతీ ఉంటే కాళేశ్వరం వద్దే చర్చ పెడదాం.

కేసీఆర్, హరీశ్‌రావులకు అధికార మత్తు ఇంకా దిగిందో లేదో తెలియదు. పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్.. ప్రభుత్వం మారాక అసెంబ్లీకి రాలేదు. సమస్యలపై మాట్లాడలేదు. ప్రభుత్వానికి సలహాలూ ఇవ్వలేదు. తన మెదడును రంగరించి, రక్తాన్ని ధారపోసి కాళేశ్వరం కట్టారట. అలా కట్టారో లేదో.. ఇలా కూలిపోయింది. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ కట్టించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం, శ్రీరామసాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, జూరాల, దేవాదుల లాంటి ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కట్టాం. మీరు కట్టినవి, మేం కట్టినవి.. ఒక్కసారి చూసొద్దాం రండి.

**సీఎం రేవంత్‌రెడ్డి**

**వరంగల్:** "కాళేశ్వరానికి పోదాం. అక్కడే కూర్చుందాం. నిపుణులను పిలిపిద్దాం. తెలంగాణ సమాజం వస్తుంది. మీకు దమ్ము, ధైర్యం, నీతి, నిజాయతీ ఉంటే కాళేశ్వరం వద్దే చర్చ పెడదాం. మీరు కట్టిన అద్భుతమేందో, అది తెలంగాణకు ఎలా ఉపయోగపడుతుందో వివరించండి" అని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారాస అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. బుధవారం హనుమకొండ జిల్లా మడికొండలో నిర్వహించిన ఓరుగల్లు జనజాతర సభలో, సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. "రామప్ప శివుడు, సమ్మక్క సారలమ్మ, భద్రకాళీ అమ్మవారి సాక్షిగా చెబుతున్నా. పంద్రాగస్టులోపు నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తా. అలా చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పిస్తానని హరీశ్ సవాల్ విసిరారు. ఆయన తన జేబులో రాజీనామా పత్రం సిద్ధంగా పెట్టుకోవాలి.

**మోదీ, కేసీఆర్‌లు.. నాణేనికి బొమ్మాబొరుసులు**

మోదీ, కేసీఆర్ నాణేనికి బొమ్మాబొరుసు లాంటివారు. ఇద్దరూ కలిసి తెలంగాణకు అన్యాయం చేశారు. రాష్ట్రానికి సోనియా గాంధీ ఇచ్చిన విభజన హామీలేవీ మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపించక ఈ ప్రాంతానికి మోదీ ద్రోహం చేశారు. కాజీపేటలో పెట్టాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మహారాష్ట్రలోని లాతూర్‌కు తరలించుకుపోయారు. ట్రిపుల్‌ఐటీ, ఐటీఐఆర్ ఇవ్వలేదు. నాడు మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పారు. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలివ్వాలి. పార్లమెంటులో నేనడిగిన ప్రశ్నకు 7,21,680 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చామని సమాధానం చెప్పారు. ఈరోజు ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతున్నారు? అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు బుద్ధిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి బుద్ధిచెప్పాలి. ఈ ఎన్నికల్లో భారాసకు ఎక్కడా డిపాజిట్ కూడా రాదు.

**మతం పేరుతో భాజపా విద్వేషాలు**

భాజపాకు మతపిచ్చి పట్టుకుంది. దేశంలో అన్ని మతాలవారు కలిసిమెలిసి జీవిస్తుంటే.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాళ్ల ఆస్తులు వీళ్లకిస్తుందని, ఒకరి రిజర్వేషన్లు తగ్గించి ఇంకొకరికి ఇస్తుందని దుష్ప్రచారం చేస్తూ మతచిచ్చు రేపడమే భాజపా నాయకుల లక్ష్యం. అందరూ కలిసిఉండటం మోదీకి ఇష్టం లేదు. గ్రామాల్లో పీర్ల పండగను ముస్లిం సోదరులతో కలిసి జరుపుకొంటాం. క్రిస్మస్ నాడు చర్చిలకు వెళ్తాం. ఇందుకు విరుద్ధంగా భాజపా నాయకులు ఓట్ల కోసం గోడలపైకి శ్రీరాముడిని తెచ్చారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వాళ్లే చేశారా? మనం చేయలేదా? మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్న భాజపాను ఓడించాలి.

**కిషన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టయినా తెచ్చారా?**

తెలంగాణ ఏర్పడకముందు కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లలో హైదరాబాద్‌కు ఐటీ, ఫార్మా పరిశ్రమలు, అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చాయి. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఓఆర్ఆర్, మెట్రోరైలు తీసుకొచ్చారు. రాజధానికి కృష్ణా, గోదావరి జలాలను తెచ్చారు. ఐదేళ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి చేసింది శూన్యం. మూడేళ్ల క్రితం హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో వరదలొచ్చినప్పుడు అప్పట్లో హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి చిల్లిగవ్వ కూడా తీసుకురాలేదు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఒక్క ప్రాజెక్టయినా తెచ్చారా? ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు వస్తున్నవారిని గుజరాత్‌లో ఏర్పాటు చేయండంటూ కేంద్ర ప్రభుత్వం బెదిరిస్తే అడ్డుకోలేదు. రైల్వేలను ప్రైవేటుపరం చేస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? రైతుల భూములు ఆక్రమించిన అరూరి రమేశ్‌కి భాజపా వరంగల్ టికెటిచ్చింది. కడియం శ్రీహరి కాంగ్రెస్ టికెట్ అడగలేదు. నిజాయతీ ఉన్నవారు ప్రభుత్వం వెంట ఉండాలని.. ఆయన వద్దకు నేనే పార్టీ పెద్దలను పంపించి టికెట్ ఇస్తామని ప్రతిపాదించా. వరంగల్‌ను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తా. అంతర్జాతీయ విమానాశ్రయం తీసుకొస్తా.

**సికింద్రాబాద్‌లో ఏ పార్టీ వారు గెలిస్తే వారిదే కేంద్రంలో అధికారం**

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఏ పార్టీవారు గెలిస్తే.. ఆ పార్టీయే కేంద్రంలో అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది. బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్‌ల విషయంలో ఇదే జరిగింది. దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.

# కెసిఆర్ భయపడతాడా.. భయపడితే తెలంగాణ వచ్చేదా..!

తెలంగాణకు శత్రువే కాంగ్రెస్ భారాస

గెలిస్తేనే ప్రజలకు న్యాయం

ప్రభుత్వ చేతగానితనం వల్లే సాగర్

ఆయకట్టుకు దుస్థితి

బస్సుయాత్రలో కేసీఆర్ తొలిరోజు


మిర్యాలగూడ, సూర్యాపేటల్లో ప్రచారం

**నల్గొండ:** '1956 నుంచి ఈనాటి వరకు తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే శత్రువు. ఇక్కడి ప్రజలు వద్దంటున్నా ఏపీలో కలిపి 58 ఏళ్లు గోస పెట్టారు. ఇప్పుడు అడ్డగోలు హామీలతో మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మళ్లీ మన రాజ్యమే వస్తుంది. దీన్ని ఎవరూ ఆపలేరు. బంగారు తెలంగాణగా చేసేవరకు విశ్రమించేది లేదు' అని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రభుత్వం, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మంత్రుల అసమర్థత వల్ల సాగర్ ప్రాజెక్టుకు దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ 'పోరుబాట బస్సుయాత్ర'ను నల్గొండ జిల్లా మిర్యాలగూడ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ, సూర్యాపేటల్లో ఏర్పాటు చేసిన రోడ్‌షోలు, కూడలి సభల్లో మాట్లాడారు. కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానని, ఆయన ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని.. కేసీఆర్ జైళ్లకు భయపడబోడని స్పష్టం చేశారు. అలా భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు.

**తెలంగాణ బతుకే నీళ్లమీద పోరాటం**

'సరిగ్గా 21 ఏళ్ల క్రితం నీళ్లు, నిధులు, కరెంటు కోసం కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేశాను. తెలంగాణ వచ్చే వరకు సాగర్ కెనాల్ కింద నీళ్లు ఇవ్వలేదు. ఆనాటి నుంచి తెలంగాణ బతుకే నీళ్ల మీద పోరాటం. పదేళ్ల భారాస పాలనలో 18 పంటలకు నీళ్లిచ్చాం. ప్రస్తుతం రాష్ట్రంలో ఏం జరుగుతోంది?

నాలుగైదు నెలల క్రితం ధీమాగా ఉన్న రైతు ప్రస్తుతం దిగాలు పడ్డాడు. నీటిపారుదల మంత్రి ఇక్కడే ఉన్నా.. చేతగాక నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పజెప్పారు. ప్రాజెక్టులో నీళ్లున్నా రైతుల పంటలను ప్రభుత్వం ఎండబెట్టింది. తెలంగాణ వచ్చాక పంటలు ఎండిపోవడం ఇదే ప్రథమం. కృష్ణాలో నీళ్లు లేకున్నా.. మూసీ నుంచి ఉదయసముద్రం మీదుగా పెద్ద దేవులపల్లి చెరువులో నీళ్లు నింపి తద్వారా ఎడమ కాల్వకు నీళ్లిచ్చే ప్రయత్నం మేం చేశాం. రెండు దఫాలుగా భారాస ప్రభుత్వం రైతులకు రూ.30 వేల కోట్ల రుణమాఫీ చేసింది. డిసెంబరు 9న రుణమాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారు. రైతుబంధును దగా చేశారు. కరెంటు మాయమైంది. మిగులు కరెంటు ఉన్నా ఎందుకు సరిగ్గా ఇవ్వడం లేదు? కాంగ్రెస్ ఎన్నికల హామీగా కల్యాణలక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఏమైంది.? మహాలక్ష్ములు, నిరుద్యోగులను మోసం చేశారు. కేసీఆర్ వైదొలిగాక నాలుగైదు నెలలకే మంచినీళ్లు మాయమయ్యాయి.



'1956 నుంచి ఈనాటి వరకు తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే శత్రువు. ఇక్కడి ప్రజలు వద్దంటున్నా ఏపీలో కలిపి 58 ఏళ్లు గోస పెట్టారు. ఇప్పుడు అడ్డగోలు హామీలతో మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

# నేడు తెలంగాణకు అమిత్ షా రాక

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఎన్నికలపై కమలం పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. తెలంగాణ లో బీజేపీ అగ్రనేతలు రసగా పర్యటించనున్నారు. ఈ క్రమంలో గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా వస్తున్నారు. గురువారం మధ్యహాన్నం 12 గంటలకు సిద్ది పేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆయన ప్రచారం చేయనున్నారు. కాగా తెలంగాణలో ఐదు బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నారు.
గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు వస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. గురు, శుక్రవారాలు బన్సల్ తెలంగాణలో పర్యటిస్తారని పెద్ద సభలు, సమావేశాల కంటే డోర్ టు డోర్ ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మే నెల 13వ తేదీ వరకు నిర్మాణాత్మకంగా ప్రచారం సాగుతుందని చెప్పారు.ఎన్నిలకు కేవలం రెండు వారాలు ఉండడంతో బీజేపీ హైకమాండ్ తెలంగాణపై దృష్టి పెట్టింది. వరుసగా పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారానికి మూడు లేదా నాలుగు సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కేంద్రమంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తున్నారు. సిద్ధిపేటలో జరగనున్న భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని ప్రసంగిస్తారు.అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 30, మే 3, 4 తేదీలలో మోదీ పర్యటించనున్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని వివిధ రంగాల ప్రముఖులతో సమావేశం కానున్నారు. మే 4వ తేదీన నారాయణ పేట్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు.
ఎన్నిలకు కేవలం రెండు వారాలు ఉండడంతో బీజేపీ హైకమాండ్ తెలంగాణపై దృష్టి పెట్టింది. వరుసగా పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారానికి మూడు లేదా నాలుగు సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

## బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

**న్యూఢిల్లీ:** బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట దక్కింది. ఇన్నాళ్లూ భారీగా పెరిగిన బంగారం ధరకు కాస్త బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా గిరాకీ తగ్గడంతో పసిడి ధర దిగి వచ్చింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర క్షీణించడంతో దేశీయంగా వెయ్యి రూపాయలకు పైనే తగ్గింది. మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి బులియన్ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర రూ.74,300గా (పన్నులు కలుపుకొని) ఉంది. వెండి కిలో ధర సైతం రూ.2 వేల వరకు
తగ్గింది. 83,300 వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సు 2322 డాలర్లుగా ఉంది. ఒక్కరోజులోనే దాదాపు 50 డాలర్లకు పైగా తగ్గింది. పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు ఇటీవల పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణమయ్యాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి బంగారంవైపు మదుపరులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఘర్షణలు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరికొంత కాలం పాటు అధిక వడ్డీ రేట్లను కొనసాగించే అవకాశాలు కనిపిస్తుండడంతో పసిడికి గిరాకీ తగ్గింది. రిస్క్‌తో కూడిన పెట్టుబడిన సాధనాల వైపు మదుపరులు పెట్టుబడులు మళ్లిస్తుండడం, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు ట్రేడర్లు మొగ్గు చూపడంతో బంగారం ధర తగ్గడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీలో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

## రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తా

**సంగారెడ్డి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది తొండి రాజకీయమని.. ఆయన ఇచ్చిన సవాలును తాను స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బుధవారం హరీష్ రావు సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ లోపు ఏకకాలంలో రైతు ఋణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయనని.. తనకు పదవులు ముఖ్యం కాదని అన్నారు. రైతు రుణమాఫీ, ఇచ్చిన హామీలు చేయకపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా..? అని ప్రశ్నించారు. ఈ విషయాలపై తాను శుక్రవారం (ఎల్లుండి) అసెంబ్లీ ముందు ఉన్న అమరుల స్థూపం వద్దకు చర్చకు వస్తానని.. సీఎం రేవంత్ కూడా రావాలని హరీష్ రావు అన్నారు. కాగా రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు విసురుతున్న సవాళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూటిగా స్పందించారు. ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేసి హామీని నిలబెట్టుకుంటానని, మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రతి సవాల్ విసిరారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు. లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవాలైన బావోజీ, సేవాలాల్‌ల సాక్షిగా ఆగస్టు 15లోగా అది జరుగుతుందని పునరుద్ఘాటించారు. తాను మాట ఇస్తే ఎలా ఉంటుందో హరీశ్‌రావు తన మామ కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తాను రుణమాఫీ చేస్తే.. బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని హరీశ్‌కు సీఎం ప్రతి సవాల్ విసిరారు. మంగళవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తాము వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలకుగాను ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కేసీఆర్ పదేళ్లలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి.. ఇలా ఏ హామీనీ కేసీఆర్ అమలు చేయలేదన్నారు. రెండుసార్లు చేసిన రుణ మాఫీ మిత్తికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. పదేళ్లు ఏ హామీ అమలు చేయని కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో కోదండం వేయాల్సిన అవసరం ఉందన్నారు. తాగుబోతు అప్పుల సంసారంలాగా రూ.3,900 కోట్ల లోటు బ్జడెట్‌ను తనకు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు అప్పగించారని, బాధ్యతగా వ్యవహరిస్తూ నాలుగు నెలల్లో రూ. 26 వేల కోట్ల కిస్తీలు, మిత్తి చెల్లించానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతీ నెల మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి రూ.1369 కోట్లు ఆర్టీసీకి చెల్లించామని వివరించారు. రూ.500లకు సిలిండర్ పథకం కింద రాష్ట్రంలో 40 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరుస్తున్నామని, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు పథకం కింద 44 లక్షల ఇళ్లలో వెలుగులు నింపుతున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకపోతే తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 22,500 కోట్లు కేటాయించి 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు.రైతుల రుణాల వసూళ్ల కోసం డీసీసీబీ తదితర బ్యాంకులు రైతులపై ఒత్తిడి తెస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఏ అధికారి ఒత్తిడి చేసినా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అసలు, మిత్తి నయా పైసలతో సహా చెల్లించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రైతుల నుంచి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రూ.500 బోన్‌సగా ఇచ్చి మరీ ప్రతీ గింజను కొంటామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్స్‌కు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు.
ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 4.78 లక్షల విద్యార్థులు హాజరుకాగా.. 2.87 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు మొత్తం 5.02 లక్షల మంది హజరవగా.. 3.22 లక్షల మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల కేటగిరీలో ఫస్టియర్‌లో 68.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. బాలుర కేటగిరీలో కేవలం 51.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బాలికల కేటగిరీలో 72.53 శాతం మంది ఉత్తీర్ణులు కాగా.. బాలుర కేటగిరీలో 56.1 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇక జిల్లాల వారీగా చూసుకుంటే ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా 71.7 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 71.58 శాత ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో, ములుగు జిల్లా 70.01 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లాకు ప్రథమ స్థానం, 79.31 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లాకు ద్వితీయ స్థానం, 77.63 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లాకు తృతీయ స్థానం దక్కాయి.

## వలసపక్షులను నమ్ముకుంటే మోసమే

**మేడ్చల్ మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా కేటీఆర్ రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో రేవంత్ రెడ్డి స్వల్ప మెజార్టీతో గెలిచారని కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంతో ఇచ్చింది. పీసీసీ, సీఎం పదవులు రావటానికి మల్కాజ్‌గిరి ప్రజలే కారణం. అలాంటి రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలకు ఏం చేయలేదు. పార్లమెంట్‌లో పత్తా లేకుండా పోయిండు. ప్రజలకు కష్టం వస్తే కనబడకుండా పోయిండు. ఈ వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరు. మీకు 24 గంటలు



అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి అని ప్రజలను కేటీఆర్ కోరారు.పదేళ్ల అభివృద్ధి కేసీఆర్ పాలన.. వంద రోజులు అబద్ధం రేవంత్ రెడ్డి పాలన అని కేటీఆర్ పేర్కొన్నారు. బడే భాయ్ మోదీ మనకు బడా మోసం చేసిండు. చోట భాయ్ రేవంత్ రెడ్డి మనల్ని ఇక్కడ మోసం చేసిండు. వంద రోజుల్లో అందరికీ అన్ని చేస్తా అంటూ చోటా భాయ్ మోసం చేసిండు. గ్దదెనెక్కిన వెంబడే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తా అన్నాడు. రుణమాఫీ అయ్యిందా? తులం బంగారం వచ్చిందా? మహిళలకు రూ. 2500 వచ్చినయా? పైన పెద్ద మోసగాడు కింద చిన్న మోసగాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి మోసం పార్ట్ -1 అనే సినిమా చూపించిండు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు మోసం పార్ట్ -2 సినిమా చూపిస్తున్నాడు. ఎక్కడ పోతే అక్కడ దేవుళ్ల మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తా అంటున్నాడు. ఒక్కసారి మోసపోతే మోసం చేసిన వాడి తప్పు. రెండో సారి మోసం పోతే మోసపోయిన వారిదే తప్పు. ఇప్పుడు ప్రజలంతా కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు అని కేటీఆర్ తెలిపారు.

## కులగణన హామీపై బిజెపిలో భయం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన 'సామాజిక-ఆర్థిక సర్వే' హామీపై ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ స్పష్టత ఇచ్చారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుకే సర్వే చేస్తామని తాము చెబుతున్నామని అన్నారు. సర్వే అనంతరం చర్యలు తీసుకుంటామని తాము చెప్పలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'సంపద సర్వే' హామీ రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రజల సంపద, నగల్ని దోచుకుని అందరికీ పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో చెబుతోందంటూ ప్రధానమంత్రి మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు కూడా మోదీ విమర్శలకు దగ్గరగా ఉన్నాయనే అభిప్రాయానికి తావిచ్చింది. అమెరికాలో వారసత్వ పన్ను ఉందని, ఆ ప్రకారం ఒక వ్యక్తి మరణం తర్వాత ఆయన సంపదనలో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు వెళ్తుందని, తక్కిన 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఇది తనకు న్యాయంగానే అనిపిస్తోందని పిట్రోడా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 'సంపద సర్వే' హామీపై కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. ఢిల్లీలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణనకు ఎందుకు బీజేపీ వారు భయపడుతున్నారని ప్రశ్నించారు. సర్వేతో అసలు సమస్య ఎంటో, ఎక్కడుందో తెలుస్తుందని అన్నారు. తాము అధికారంలోకి రాగానే తొలి నిర్ణయం దీనిపైనే ఉంటుందన్నారు. సమాజంలో అన్యాయానికి గురవుతున్న 90 శాతం మందికి న్యాయం కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుక సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన ఉద్దేశమని చెప్పారు. దేశభక్తులమని చెప్పుకునే వారికి సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన గురించి భయమెందుకని ప్రశ్నించారు. 70 ఏళ్ల తర్వాత చేపట్టనున్న కీలకమైన సర్వే ఇదని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ప్రధానిలో ఆందోళన మొదలైందని చెప్పారు. 90 శాతం భారతీయులకు అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేయాలని తాను చెప్పినప్పటి నుంచి ప్రధాని, బీజేపీ తనపై దాడి మొదలుపెట్టినట్టు చెప్పారు. కచ్చితంగా తమది (కాంగ్రెస్) రివల్యూషనరీ మేనిఫెస్టో అని రాహుల్ స్పష్టం చేశారు.

## ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యం పోలీస్ రాజ్యం నడిపిన జగన్

**విజయవాడ**: రాష్ట్రంలో ఐదేళ్లు పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు నేతలు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని టీడీపీ నేత బోండా ఉమా విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు పవన్ కళ్యాణ్ వంటి నాయకులను పోలీసులు వేధించారన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక, నామినేషన్‌లు వేశాక కూడా పోలీసులు అరాచకాలు ఆగలేదన్నారు. తాడేపల్లి ప్యాలెస్ ఒత్తిడితో కొంతమంది పోలీసులు టీడీపీ అభ్యర్థులపై అనేక కేసులు పెట్టారన్నారు. తప్పుడు కేసులు పెట్టారనేందుకు తానే ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. సీఎం పరిధిలో పోలీసులు లేరనే విషయం కూడా తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీసులు పనిచేయాలన్నారు. సజ్జల, మరో గొట్టంగాడు చెప్పాడని తమపై అక్రమ కేసులా అంటూ విరుచుకుపడ్డారు. నిన్న ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నియమావళి వర్తిస్తుందని తెలిపారు. వైసీపీ కండువా కప్పుకుని పనిచేసే పోలీసులపై ఫిర్యాదు చేస్తామని.. చట్టానికి, నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నార్త్ ఏసీపీ డి.యన్.ఎ ప్రసాద్, సీఐ దుర్గా ప్రసాద్‌లు వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపించారు.'వెల్లంపల్లి పోస్ట్‌లు వేపించారని స్వామి భక్తి చూపుతున్నారు. మమ్మల్ని అన్యాయంగా ఇబ్బందులు పెడుతున్నారు. మా వాళ్లు ఎక్కడైనా కనిపిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారు. పోటీలో ఉన్న నేను ప్రచారానికి అనుమతి ఇవ్వాలని అర్జీ పెట్టాం. ఏసీపీ, సీఐలు అనుమతి రిజక్ట్ చేస్తున్నట్లు ఆర్‌ఓకి చెప్పారు. నేను స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే వీలు లేకుండా చేశారు. అడిగితే పనికిమాలిన కారణాలు, ఆంక్షలు పెడుతున్నారు. ఏ సమయంలో ఏ వీధిలో ఎవరి ఇంటి ముందు ఉంటారో సమయం చెప్పాలంట. ఎన్నికల ప్రచారంలో చెప్పిన సమయం ప్రకారం ప్రచారం నడుస్తుందా? నా రాజకీయ జీవితం లో ఇటువంటి నిబంధన ఎప్పుడూ చూడలేదయ, వినలేదు. దేశం మొత్తం లో కూడా పోటీ చేసే అభ్యర్థిగా రాత్రి తొమ్మిది వరకు ప్రచారం చేసుకోవచ్చు. నాకు పోలీసు పర్మిషన్ లేదని నా ప్రచారం ఆపడం దుర్మార్గం కాదా? వెల్లంపల్లికి ఈ నిబంధనలు వర్తించవా? సమయం వారికి పట్టదా?. ఇప్పటికే ఈ ఏసీపీ, సీఐలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. ఈరోజు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి మరోసారి ఆధారాలతో ఫిర్యాదు చేస్తున్నాం అని బోండా ఉమా వెల్లడించారు.

## విశాఖ ఉక్కు నష్టాలు తెలియవా

**విజయవాడ:** విశాఖ ఉక్కు నష్టాల్లో ఉందన్న విషయం తెలియదనటం సీఎం పదవికే అవమానమని సిపిఐ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. జగన్, చంద్రబాబు బీజేపీ తానులో ముక్కలేనని.. వైసీపీ, టీడీపీలలో ఎవరిని గెలిపించినా బీజేపీ కుంపటి ప్రజల నెత్తిన పెట్టడం ఖాయమని రామకృష్ణ వ్యాఖ్యానించారు.. ఎన్డీఏ తోనే వైసీపీ కాపురమంటూ మనసులో మర్మాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బయటపెట్టారని రామకృష్ణ విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. 1200 రోజులుగా విశాఖ ఉక్కు ఉద్యమం జరుగుతున్నా పట్టించుకోని జగన్‌కు ఇవాళ ఉక్కు కార్మికుల ఓట్లు గుర్తొచ్చాయా? అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల నాయకులకు సీఎం జగన్ పెద్ద ఝలక్ ఇచ్చారు. స్టీల్‌ఎ÷-లాంట్ సమస్యలు పరిష్కరించాలని
నేతలు కోరగా, ఆయన విచిత్రమైన సమాధానం ఇచ్చారు. 'ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 230-240 కంటే ఎక్కువ సీట్లు రాకూడదని ప్రార్థన చేయండి. అప్పుడు వైసీపీ మద్దతుతో బీజేపీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది' అని జగన్ సెలవిచ్చారు. తద్వారా కేంద్రంలో ఎన్డీయేకే తన మద్దతు ఉంటుందనే విషయాన్ని సూటిగా చెప్పేశారు.

## మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మోడీ వ్యాఖ్యలు

కరీంనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తోందని కరీంనగర్ ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్ మండిపడ్డారు. మోదీ ప్రధానమంత్రిగా మత వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మోదీ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసేవారిపై అనర్హత వేటు వేయాలన్నారు. ఇందిరాగాంధీ హయాంలో కూడా 'ఇందిర అంటే ఇండియా.. ఇండియా అంటే ఇందిరా' అనుకున్నారని, అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని వ్యాఖ్యానించారు. కరీంనగర్ లోక్‌సభ



నియోజకవర్గ పరిధిలో బోయినపల్లి వినోద్ కుమార్ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం రోజూ రెండు పూటలా ఆయన ప్రచారం కొనసాగుతోంది. బుధవారం ఉదయాన్నే వేములవాడ పట్టణంలో మార్నింగ్ వాకర్స్‌తో వినోద్ కుమార్ మాట్లాడారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కరీంనగర్ ప్రజలు గతంలో బండి సంజయ్‌కి బావోద్వేగంతో ఓట్లు వేశారని, ఐదేళ్లు ఎంపీగా ఉండి ఆయన ఐదు రూపాయలు కూడా తేలేదని వినోద్‌కుమార్ విమర్శించారు. అందుకే నియోజకవర్గ ప్రజలు ఈసారి సంజయ్‌కు ఓటు వేయొద్దని నిర్ణయించుకున్నారని చెప్పారు. గర్భిణులకు పాలు, గుడ్లు ఇస్తున్నామని బీజేపీ వాళ్లుపోస్టర్‌లు వేసుకున్నారని, ఆ పథకం జవహర్‌లాల్ నెహ్రూ అంగన్‌వాడీల ద్వారా అమలు చేసినప్పటి నుంచే ఉందని అన్నారు. వంద రోజుల ఉపాధి హామీ పనులకు నిధులు ఇస్తున్నామని చెబుతున్నారని, దాని గురించి మన చట్టంలోనే ఉందని వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి నలుగురు ఎంపీలు గెలిచి రాష్ట్రానికి తెచ్చిందేమీ లేదని అన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి తెలంగాణ సమస్యలపై 553 సార్లు ప్రశ్నలు అడిగానని, కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ సిరిసిల్ల వరకు తీసుకువచ్చానని, జాతీయ రహదారులు కూడా తీసుకువచ్చా నని చెప్పారు. బండి సంజయ్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు కనీసం ఒక నవోదయ పాఠశాల కూడా తేలేదని వినోద్ విమర్శించారు. తన హయాంలో కరీంనగర్‌కు రూ.1000 కోట్ల నిధులు తెచ్చినట్లు తెలిపారు. తనను పార్లమెంటుకు పంపితే తెలంగాణ ప్రజల గొంతుకై వినిపిస్తానని ఆయన చెప్పారు. గోదావరి జలాలను అచ్చంపల్లి ద్వారా తమిళనాడు తరలిస్తాం అంటున్నారని, దాంతో మనకు అన్యాయం జరుగుతుందని అన్నారు. తాను మట్టి పనికైనా మన ఊరి వాడిగా ఉంటానని అన్నారు. ప్రజలు బాగా ఆలోచించి పనిచేసే తనకు అవకాశం కల్పించాలని కోరారు.

## దేవుళ్ల పేరుతో హామీలిచ్చి మోసం చేస్తారు

**కరీంనగర్:** ముఖ్యమంత్రి ఎక్కడికిపోయినా దేవుడి మీద ఒట్టేసి హామీలను అమలు చేస్తామని ప్రకటిస్తున్నారని బిజెపి కరీంనగర్ అబ్యర్థి బండి సంజయ్ అన్నారు. గద్వాల పోయి జోగులాంబ
అమ్మవారి మీద ఒట్టేస్తరు. యాదాద్రి పోయి లక్ష్మీ నర్సింహస్వామి మీద ఒట్టేస్తరు..వరంగల్ పోయి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టేస్తరు.. నేను మాట్లాడితే తప్పని ఎందుకంటున్నారని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ప్రసశ్నించారు. తాను వాళ్ల లెక్క దేవుడిపై ఒట్టేసి హామీలు అమలు చేయకుండా మోసం చేయడం లేదు. దేశం కోసం, ధర్మ రక్షణ కోసం పోరాడుతున్నానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా నేటికీ తేల్చుకోలేని నాయకులు తనను ఓడిస్తానని బీరాలు పలుకుతున్నారని



ఎద్దేవా చేశారు. ఇక్కడున్నాయన పార్టీకి, సీఎంకు చెప్పకుండా వెలిచాల రాజేందర్ ను తీసుకుపోయి నామినేషన్ వేయిస్తడు. ఈ విషయం తెలిసి సీఎం, హైకమాండ్ గరం అయితున్నరు. ఇయాళ పోటీగా అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కూడా నామినేషన్ వేస్తడట.. రేపే నామినేషన్లకు ఆఖరు తేదీ. ఇప్పటి వరకు అధికారికంగా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తేల్చుకోలేకపోతున్న నేతలు నాపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో పలు పార్టీల నేతలు బీజేపీలో చేరిన సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. గస్టు 15న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తారట. ఎన్నికల్లోపే ఎందుకు చేయలేదు. పోనీ ఎన్నికల కోడ్ అయిపోగానే జూన్ 4న రుణమాఫీ చేయొచ్చు కదా.. ఎందుకు చేయరు? పార్లమెంట్ ఎన్నికలైపోంగనే స్థానిక సంస్థలు కూడా నిర్వహించి ఓట్లు దండుకున్నా.. రుణమాఫీసహా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేయాలని ప్రభుత్వం ఎ÷-లాన్ వేసింది. అందుకే ఈ కపట నాటకమాడుతూ దేవుడిమీద ఒట్టేసి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హామీలివ్వకపోతే... అవి నెరవేర్చేదాకా కొట్లాడే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే. బోనస్ ఇచ్చేదాకా వెంటాడతాం. తాలు, తరుగు, తేమతో పని లేకుండా వడ్లు కొనాలంటే రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు అవుతాయి. వడ్లకు బోనస్ కోసం రూ.3,500 కోట్లు అవసరమవుతాయి. వీటినే ఖర్చు చేయలేనోళ్లు రుణమాఫీ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తానంటే నమ్మేదెవరు? వీటి కోసం కొట్లాడి కాంగ్రెస్ మెడలు వంచేదాకా పోరాడేది బీజేపీయే. కేసీఆర్ సర్కార్ మోసాలను ఎండగట్టి ఫాంహౌజ్ లో పడుకున్నోడిని ధర్నా చౌక్ కు గుంజుకొచ్చినానే అక్కసుతో నన్ను ఓడగొట్టాలని కుట్ర చేస్తున్నడని మండిపడ్డారు. 6 గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ను నిలదీస్తుంటే... నన్ను ఓడించాలని బీఆర్ఎస్ తో కలిసి ఇక్కడున్న కాంగ్రెస్ నేతలు కుట్ర చేస్తున్నరు.. నేనడుగుతున్న నేనడుగుతున్నా... మహిళలకు నెలనెలా రూ.2,500లు బ్యాంకులో జమ చేస్తామన్నరు. ఎందుకు ఇవ్వలేదు? వృద్దులు, వితంతవులు, బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచి నెలనెలా ఇస్తామని ఎందుకివ్వలే? ఇండ్లు లేని వాళ్లందరికీ ఇంటిజాగాతోపాటు 5 లక్షల సాయమందిస్తామని ఇంతవరకు ఒక్కరికైనా ఇచ్చారా? రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా కింద 15 వేల ఆర్థిక సాయం, రైతు కూలీలకు 12 వేల సాయమందిస్తామన్నారు. రైతులు అల్లాడుతున్నా ఎందకు బోనస్ ఇవ్వలేదు? విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఇచ్చి చదువుపై భారం పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఒక్కరంటే ఒక్క విద్యార్థికైనా భరోసా కార్డు ఇచ్చారా?రైతులకు 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తాం. వడ్లు, మిర్చి, మొక్కజొన్న, మిర్చి, పసుపు సహా పంటలకు క్వింటాలుకు 5 వందల చొప్పన బోనస్ ఇస్తామన్నరు. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర ఇచ్చి వడ్లను కొనుగోలు చేస్తామన్నరు. వడ్ల కల్లాల వద్ద రైతులు అల్లాడుతున్నరు. ఎంతమందికి బోనస్ ఇచ్చారు? ఎంత మంది వద్ద తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లు కొన్నారు? బీఆర్ఎస్ హయాంలో మూసివేసిన 6 వేల స్కూళ్లను తెరిపిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని స్కూళ్లు తెరిపించారు?స్థానిక సంస్థలకు పూర్తి స్థాయిలో నిధులు, విధులు అప్పగిస్తామన్నారు. ఎన్ని నిధులిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.
మోదీ బాత్రూంలే కాదు.. అన్ని కట్టించిండు. మోదీ ఇండ్ల కోసం నిధులిస్తే కేసీఆర్ దారి మళ్లించిండు. పంచాయతీలకు వేల కోట్ల నిధులిస్తే కేసీఆర్ దారి మళ్లించిండు. గరీబ్ కళ్యాణ్ యోజన కింద ఉచితంగా బియ్యం ఇస్తుంటే కేసీఆర్ బొమ్మలు పెట్టుకున్నరు... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేసీఆర్ రాచిరంపాన పెట్టిండని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో నేటికీ తెలియదు. ఒకాయన పార్టీకి, సీఎంకు చెప్పకుండా వెలిచాల రాజేందర్ ను తీసుకుపోయి నామినేషన్ వేయించాడట. ఈ విషయం తెలిసి సీఎం, హైకమాండ్ గరం అయ్యిందట. ఇయాళ అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కూడా నామినేషన్ వేస్తడట.. రేపే నామినేషన్లకు ఆఖరు తేదీ. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తేల్చుకోలేకపోతున్న నేతలు బీజేపీని ఓడిస్తామని బీరాలు పలుకుతుంటే నవ్వొస్తుందని ఎద్దేవాచేశారు.

# నేటి నుండి ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ.






## ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలి.

## నామినేషన్ల స్క్రూటినీలో నిబంధనలు పక్కాగా పాటించాలి.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో సీఈఓ వికాస్ రాజ్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 24**

పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల గురువారం నుండి పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావాలన్నారు. ఉన్నతాధికారులతో కలిసి సీ.ఈ.ఓ బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. తుది ఓటరు జాబితా రూపకల్పన, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, పోలింగ్ కేంద్రాలలో సదుపాయాల కల్పన, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై సీ.ఈ.ఓ కీలక సూచనలు చేశారు. ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులలో ఇంకనూ పెండింగ్లో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలని, ఈ నెల 25న తుది ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన మీదట ఈ నెల 29న పోటీలో ఉన్న గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు తుది ఓటరు జాబితాను అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రాంతాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి తగిన ఏర్పాట్లు ఉన్నాయా? అన్నది పరిశీలించేలా చూడాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు వంటి వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరుపుతూ ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. కాగా, గురువారం నాటితో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనున్న నేపథ్యంలో, చివరి రోజున ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావులేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మధ్యాహ్నం 3.00 గంటల లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు చేరుకున్న వారి నామినేషన్లు స్వీకరించాలని, గడువు దాటిన మీదట వచ్చే వారి నామినేషన్లు స్వీకరించకూడదని అన్నారు. ఈ నెల 26న చేపట్టే స్క్రూటినీ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. స్క్రూటినీలో నామినేషన్లు తిరస్కరణకు గురైతే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు, గుర్తులతో కూడిన పోస్టల్ బ్యాలెట్ ల ముద్రణ చేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కెసిఆర్ వితండవాదం !



తప్పులెన్ను వారు తమ తప్పులెరగరు..అని శతకకారుడు ఎప్పుడో చెప్పాడు. అది కెసిఆర్ విషయంలో బాగా పనికి వస్తుంది. ఎన్నో తప్పులు చేసినా..కనీసం ఒక్కటయినా ఒప్పుకోవడానికి ఆ మహానుభావుడు సిద్ధంగా లేదు. అందులో ప్రధానమైనదే ఫోన్ ట్యాపింగ్ అంశం. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్‌తో తమకు సంబంధం లేదని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక్కముక్కలో తేల్చేశారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా చేసే పనికి తమకు సంబంధం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సిల్లీ, థర్డ్ క్లాస్ ఆరోపణ. లా అండ్ ఆర్డర్ కాపాడటానికి, ప్రతీప శక్తులను అడ్డుకోవడానికి పలు మార్గాల్లో పోలీసులు సమాచారం సేకరిస్తుం టారు. అందులో ఇంటర్‌సెప్షన్ ఒకటి. అది అధికారికంగా చేస్తారు. 'ఫలానా వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేసినం' అని అధికారులు ముఖ్యమంత్రి కి చెప్పరు. సీఎంకు సంబంధముండదు. ఇప్పుడున్న ముఖ్యమంత్రికీ రోజూ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ వస్తుంది. దీన్నికూడా రాజకీయం చేయడమంటే దివాళాకోరుతనం ఇంకోటి ఉండదని ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇంతకాలం మౌనంగా ఉంటూ తనపై వచ్చిన ఆరోపణలను ఇలా కొట్టి పడేశారు. అయితే ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న దర్యాప్తులో అనేక విషయాలు బయట పడుతున్నాయి. వాటి గురించి మాట్లాడ లేదు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మాత్రం తానే సిఎంనని కూడా చెప్పుకున్నారు. నిజానికి ఇలా జరుగుతాయా అన్నది ఆయనకే తెలియాలి. ఆర్థిక దివాళా అన్నది అతిపెద్ద సమస్య. దీనిపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్ఎస్ అంటే ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలో వచ్చింది. కేసీఆర్ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం తెలంగాణలో ఉద్యమ నినాదాలకు తిలోదకాలు ఇచ్చి నియంతృత్వ పాలన సాగించారు. నేనే రాజు,నేనే మంత్రి అనే రీతిలో నియంత పాలన సాగింది. ప్రతిపక్షాలు లేని వ్యవస్థ కావాలని కలలు కన్నారు. ప్రతిపక్షాలను గౌరవించకుండా, వాటిని గుర్తించకుండా పాలన చేశారు. ఏ ఒక్క సందర్భంలోనూ పదేళ్ల కాలంలో ఆయన విపక్షాలతో చర్చించలేదు. సంచలనం కలిగించిన పేపర్ లీకేజీలు, మేడిగడ్డ కుంగుబాటు వంటి సమస్యలను కూడా ఏనాడు చర్చించలేదు. అసెంబ్లీలో చర్చ లేకుండా చేశారు. ఇకపోతే ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూసి కాంగ్రెస్, టిడిపి, సిపిఐ ఎమ్మెల్యేలను గంపగుత్తగా తన మందలో కలుపుకున్నారు. దీనికి తెలంగాణ పునరేకీకరణ అని చెప్పుకొచ్చారు. ఈ పార్టీలకు తెలంగాణలో ఉనికి లేకుండా చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులను కూడా కొనుగోలు చేసి ఆ పార్టీని బలహీనపర్చారు. ఇప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటువేయండి అంటున్న నేతలంతా అప్పుడు నిర్లజ్జగా ఎమ్మెల్యేలను కలుపుకున్నారు. అసెంబ్లీలో ఎవ్వరినీ మాట్లాడనీయకుండా చేశారు. మాట్లాడిన వారిని సస్పెండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేక పాత్ర పోషించిన అన్ని పార్టీల ఎమ్మెల్యేను కూడా దుర్మార్గంగా టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. 2018లో టీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత అదే పనిని కొనసాగించారు. తెలంగాణ అంటే టీఆర్ఎస్ అంటే నేనే అనే అహంభావంతో కెసిఆర్ వ్యవహరిం చారు. అందుకే ప్రభుత్వం పడిపోయాకనే జరిగిన అనేక అవతవకలు అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలో ఫోటన్ ట్యాపింగ్‌ను తూఛ్.. అన్నంత మాత్రాన అది పోయేది కాదు. నిజాలు నిగ్గు తేలుస్తారు. ఎవరెవరు ఎలా వ్యవహరించారో, ఎంతగా బరితెగించారో తెలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగంలోతనకు నచ్చిన ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు.. అంటే చెబితే వినే వారిని ఏళ్లుగా ఒకే పదవిలో కొనసాగించారు. పది జిల్లాల తెలంగాణ 33 జిల్లాలు చేసి పరిపాలన చిన్నాభిన్నం చేశారు. ఇలాచేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. అనవసరంగా కలెక్టరేట్ల నిర్మాణాలకు తగలేశారు. ఇలాంటి సమయాల్లో కూడా విపక్షాలతో చర్చించాలన్న ఇంగితం కెసిఆర్ ప్రదర్శించలేదు. ఏకపక్షనిర్ణయాలు, నియంతృత్వం పోకడలు భరించలేనంతగా సాగాయి. ఉద్యమంలో పాల్గొన్న మేధావుల సలహాలు తీసుకోకపోవడం అటుంచి వారిని గడపకూడా తొక్కనీయలేదు. ఏకవ్యక్తి పోకడలతో అధికార దుర్విని యోగానికి పాల్పడ్డాడు. చట్టాలను చట్టుబండలు చేశాడు. మాట్లాడిన వారిపై కేసులు పెట్టారు. ప్రాజెక్టుల్లో అయితే భారీగా అవినీతి బయటపడింది. రైతులను రోడ్డున పడేశారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించి జులుం చలాయించారు. అయినా వారికి గౌరవంగా దక్కాల్సిన పరిహారం దక్కలేదు. సాగునీటి ప్రాజెక్టులు పనులను పక్కకు పెట్టి మేడిగడ్డ అన్నారు. సుందిళ్ల బ్యారేజిలు కట్టి కాళేశ్వరం రూపొందించారు. కాళేశ్వరం పేరుతో ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి దాదాపు 94 వేల కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఇలా ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు ఆర్థిక అరాచకత్వానికి అద్దం పడుతున్నది. అడ్డగోలుగా విద్యుత్ వ్యయం, అప్పులు, వడ్డీలు, కాళేశ్వరం ప్రాజెక్టు రూపేణా ప్రభుత్వం మీద ఆర్థిక భారం మోపారు. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం విషయం లో కేసీఆర్ ఒంటెద్దు పోకడలు అనేక తప్పటడుగులు వేశారు. సిద్ధిపేటతోపాటు కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు నీళ్లు వచ్చే విధంగా కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగిపోవడం, సుందిళ్ల వద్ద ప్రాజెక్టులకు బుంగలు పడటం కేసీఆర్ మార్కు పాలనకు అద్దం పడుతోంది. ప్రజాసమస్యల వేదిక ప్రజాగొంతుక అయిన ఇందిరాపార్కు ధర్నాచౌక్ ఎత్తివేసిన ఘనత కూడా కేసీఆర్‌కే చెల్లుతుంది. ఇలా అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డ కెసిఆర్..తప్పులను ఒప్పుకోవడానికి సిద్ధంగా లేరు. ఇంకా నాలుగు నెలల క్రితమే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులపై ఎదురుదాడికి దిగుతున్నారు. వారు ఏమీ చేయడం లేదని రోడ్డెక్కి గోల చేస్తున్నారు. రాజకీయాలను భ్రష్టు పట్టించిన కేసీఆర్‌కు ఇప్పుడు బీఆర్ఎస్ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. అయినా తండ్రీ కొడుకులు, అల్లుడు బింకం వదలడం లేదు.

# మేజర్ లీగ్ బేస్ బాల్ విజేతగా "సత్యశోధక్" విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఏప్రిల్ 24**

హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా (23, 24 మంగళ, బుధవారం ) జరిగిన హైదరాబాద్ రీజినల్ (తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిపి ) మేజర్ లీగ్ బేస్ బాల్ (ఎం. యల్. బి ) అండర్ 12 ఛాంపియన్ పోటీలలో సత్యశోధక్ పాఠశాల జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకుంది. నిజామాబాద్ లో జరిగిన రౌండ్-1 మేజర్ లీగ్ బేస్ బాల్ కప్ ఎంపిక పోటీలలో సత్యశోధక్ పాఠశాల జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి హైదరాబాద్ రిజియాన్ స్థాయికి ఎంపికైనది. రీజినల్ స్థాయిలో లిగ్ దశలో సత్యశోధక్ పాఠశాల జట్టుతో పాటు 8 జట్లు పాల్గొన్నాయి. హైదరాబాద్ రిజియాన్ విజేతగా నిలిచిన జట్టుకు మేజర్ లీగ్ బేస్ బాల్ (ఎం ఎల్ బి) కప్ ఇండియా ఇన్చార్జ్ అమెరికాకు చెందిన డేవిడ్ పాలేస్ మరియు ఇండియా కోచ్ డాక్టర్ కృష్ణ చేతుల మీదుగా ట్రోఫీ మెమొంటోని అందించి అభినందించారు. హైదరాబాద్ రిజియాన్ స్థాయికి ఎంపికైన సత్యశోధక్ పాఠశాల జట్టులో పాఠశాలకు చెందిన పి.హేమంత్, డి.శ్రీకాంత్, కె.హర్షవర్ధన్, జి.విశాల్ డి.అన్వేష్, బి.తిరుపతి, యస్ . స్నేహిత్, కే . శ్రీకాంత్,బి .సాత్విక్, జి.ప్రతీప్, బి హర్షిత్, కె. అజయ్ లు సభ్యులుగా, పాఠశాల పి.ఈ.టి. ఉపాధ్యాయులు దండు అనిల్, బాదావత్ సంతోష్ లు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించారు. హైదరాబాద్



రీజినల్ లీగ్ బేస్ బాల్ అండర్ 12 విభాగంలో సత్యశోధక్ పాఠశాల జట్టు ఛాంపియన్ గా నిలవడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం పరుస్తూ, జట్టు విజయానికి కృషి చేసిన పాఠశాల క్రీడాకారులను, కోచ్ మేనేజర్లను మరియు సహకారం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.జిల్లా నుండి సత్యశోధక్ పాఠశాల జట్టు హైదరాబాద్ రీజినల్ మేజర్ లీగ్ బేస్ బాల్ కప్ విజేతగా నిలవడం పట్ల జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్ హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్చంట్ గంగా మోహన్, సంయుక్త కార్యదర్శి చిప్ప నవీన్ పాల్గొన్నారు.



## బిజెపి, బిఆర్ఎస్‌లకు

# డిపాజిట్లు రావు

నల్లగొండ:పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మనుగడ ఉండదన్నారు. దేశంలోనే అత్యధిక మెజార్టీని నల్లగొండ పార్లమెంట్ నుంచి రఘువీర్‌కు అందించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకోసం ఇండియా కూటమి గెలుపు చరిత్రాత్మక అవసరమన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోదీ వారి ఆదాయాన్ని తగ్గించారని ఆరోపించారు. బీజేపీ వారికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఎన్నికల తర్వాత కొత్త రేషనకార్డులు ఇస్తామన్నారు. సాగర్‌లో 35 వేల ఎకరాలు ఎత్తిపోతల ద్వారా సాగవుతుందని వాటి పూర్తి మరమ్మతు బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. నెల్లికల్లు ఎత్తిపోతలను రూ.200 కోట్లతో రెండేళ్లలో పూర్తి చేసి ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే రెండు లక్షల ఎకరాలకు, సాగర్ ప్రజలకు సాగునీరు అందించిన ఘనత తమదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక ప్రాజెక్టులు కట్టిందన్నారు. పోడుభూముల చట్టం ద్వారా రాష్ట్రంలో 8 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు. స్వామినాథన కమిషన ఏర్పాటును మోదీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యకర్తలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని మంత్రి ఉత్తమ్ అన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడి సమన్వయంతో పని చేసి అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు.

# రైతుల ఖాతాలో రూ.70 కోట్లు జమ.

**- జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు.**

వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఏప్రిల్ 24: జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలకు గాను 264 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 14,331 మంది రైతుల నుంచి 89,244 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు అన్నారు. కామారెడ్డి మండలం గర్గుల్, రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 196.61 కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.70 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతులకు డబ్బులు సకాలంలో అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, తాగునీటి వసతి అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. వసతులు బాగున్నాయని రైతులు తెలపడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్, అడ్డూర్ ఎల్లారెడ్డి సహకార సంఘం సీఈఓ బైరయ్య, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## కార్తీ సర్దార్‌కు సీక్వెల్

పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'సర్దార్'. 2022లో విడుదలై సూపర్ హిట్ జాబితాలో నిలిచింది. వసూళ్ల పరంగా రూ.100 కోట్లు సాధించింది. మినరల్ వాటర్ పేరుతో విక్రయించే తాగునీటిలో ఉండే శరీరానికి హాని కలిగించే అంశాలు, వాణిజ్య పరమైన రాజకీయాలను దర్శకుడు కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఇందులో హీరో కార్తీ పోలీస్ ఆఫీసర్‌గా, రా ఏజెంట్‌గా నటించి, ప్రేక్షకుల మనసులను గెలుచుకున్నారు. యాక్షన్, థ్రిల్లర్ కోణంలో సాగిన ఈ చిత్రంలో రజీషా విజయన్, రాశీఖన్నా, లైలా,చుంకీపాండే ప్రధాన పాత్రలను పోషించగా జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సీక్వెల్ సర్దార్ 2 రూపొందనుంది. కార్తీజన్మదినం సందర్భంగా మే 25న ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీపావళికి ఫస్ట్ లక్ రిలీజ్ చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ దఫా సినిమాలో డ్రగ్స్ అక్రమ రవాణాను ప్రధానాంశంగా చేసుకుని 'సర్దార్-2'ను తెరకెక్కించాలని దర్శకుడు పీఎస్ మిత్రన్ ప్లాన్ చేసినట్టు సమాచారం. ముఖ్యంగా సమాజానికి, యువతకు మాదకద్రవ్యాలు ఏ విధంగా హాని కలిగిస్తున్నాయే అంశంతో యవతలో చైతన్యం, అవగాహన కల్పించేలా ఈ కథను సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. అయితే, ఈ ప్రాజెక్టుపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది.

## దీపక్ పరంబోల్‌తో అపర్ణాదాస్ ఏడడుగులు



'ఆదికేశవ'తో తెలుగువారికి సుపరిచితురాలైన నటి అపర్ణాదాస్. హీరో సోదరి పాత్రలో నటించి, ఇక్కడి ప్రేక్షకులను అలరించారు. తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 'మంజుమ్మెల్ బాయ్స్'తో ఇటీవల విజయాన్ని అందుకున్న మలయాళీ నటుడు దీపక్ పరంబోల్‌తో ఆమె ఏడడుగులు వేశారు. కేరళలోని గురువాయూర్ దేవాలయంలో బుధవారం ఉదయం వీరి పెళ్లి ఘనంగా జరిగింది. ఇరు కుటుంబాల పెద్దలు, సన్నిహితులు ఈ వేడుకకు హాజరయ్యారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో తాజాగా నెట్టింట వైరల్‌గా మారింది. నెటిజన్లు కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'నాన్ ప్రకాశన్'తో నటిగా తెరంగేట్రం చేశారు అపర్ణాదాస్. 2019లో విడుదలైన 'మనోహరమ్' హీరోయిన్‌గా ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే దీపక్ పరంబోల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారి.. పెద్దల అంగీకారంతో ఇప్పుడు పెళ్లి చేసుకున్నారు. 2023లో విడుదలైన 'డాడా' అపర్ణాదాస్ కెరీర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె మలయాళంలో తెరకెక్కుతోన్న 'ఆనంద్ శ్రీబాల' కోసం వర్క్ చేస్తున్నారు.

## విశ్వక్‌సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే గామి సినిమాతో హిట్ కొట్టిన ఈ కుర్ర హీరో తాజాగా మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు. విశ్వక్‌సేన్ ప్రధానపాత్రలో వస్తున్న తాజా చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి ఈ మూవీకి ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తుండగా.. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను తెలంగాణ లోక్‌సభ ఎన్నికల అనంతరం మే 17న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ టీజర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా టీజర్‌ను ఏప్రిల్ 27 సాయంత్రం 4.01 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార సంస్థ బ్యానర్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. అంజలి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విశ్వక్‌సేన్ మరోవైపు 10లో కూడా నటిస్తున్నాడు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.





## ఇక్కడ లేని రాశి అక్కడ జోరు..!

అందాల రాశి ఖన్నా తెలుగు లో ఊహలు గుసగుసలాడే సినిమాతో అడుగు పెట్టింది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో యంగ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాన్ని దక్కించుకుంది. అయితే లక్ కలిసి రాకపోవడంతో ఎక్కువ శాతం ఫ్లాప్స్ పడ్డాయి.రాశి ఖన్నా టాలీవుడ్ లో కంటే ఇప్పుడు కోలీవుడ్ మరియు బాలీవుడ్ లో ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. టాలీవుడ్ యంగ్ హీరోల సినిమాల్లో ఆ మధ్య వరుసగా నటించిన రాశి ఖన్నా ఈ మధ్య తెలుగు ఫిల్మ్ మేకర్స్ ని ఆకర్షించడం లో విఫలం అవుతుంది.టాలీవుడ్ లో దక్కని ఆఫర్లను కోలీవుడ్ మరియు బాలీవుడ్ లో దక్కించుకుంటూ ఉంది. తమిళనాట ఈ అమ్మడు కెరీర్ ఆరంభం నుంచి సినిమాలు చేస్తూ అక్కడ తనకంటూ ప్రత్యేక గుర్తింపును మరియు క్రేజ్ ని దక్కించుకుంది. అయితే బాలీవుడ్ లో మాత్రం ఇటీవలే అడుగు పెట్టిందిహిందీ సినిమాల్లో ఈ అమ్మడికి వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. యోధ సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా ఫలితం తో సంబంధం లేకుండా మరో ఆఫర్ ను ఈ అమ్మడు దక్కించుకుంది. ఇక ఈమె ది సబర్మతి రిపోర్ట్ సినిమా తో మరోసారి హిందీ ప్రేక్షకుల ముందుకువెళ్లబోతోంది.మొత్తానికి తెలుగులో పెద్దగా ఆఫర్లు లేకున్నా కూడా ఇతర భాషల్లో రాశి ఖన్నా ఆఫర్లు దక్కించుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతుంది. ముందు ముందు కూడా ఈ అమ్మడు అక్కడే ఎక్కువ సినిమాలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టాలీవుడ్ లో ఈ అమ్మడి జర్నీ దాదాపుగా ముగిసినట్లేనా అనే చర్చ కూడా జరుగుతోంది. మరి లక్ బాగుంటే రాశి టాలీవుడ్ లో రీ ఎంట్రీ ఇస్తుందేమో చూడాలి.

## లవ్‌మీ చిత్రం విడుదల వాయిదా




టాలీవుడ్ యువ నటులు ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'లవ్‌మీ'. 'ఇఫ్ యు డేర్' ఉపశీర్షిక. దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మిస్తుండగా.. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నాడు. ఓ కుర్రాడు దెయ్యాన్ని ప్రేమించాలనుకుంటే ఎలా ఉంటుంది..ఏమవుతుందనే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను మొదట ఏప్రిల్ 27న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అనుకోని కారణాల వల్ల సినిమా తేదీ వాయిదా పడింది. ఇప్పుడు తాజాగా మరో కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను మే 25న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రానికి కెమెరా: పీసీ శ్రీరామ్, సంగీతం: కీరవాణి, నిర్మాణ సంస్థ: దిల్‌రాజు ప్రొడక్షన్స్.ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో ఎన్నికల హంగామా, విపరీతమైన ఎండలు, దానికి తోడు ఐపీఎల్ క్రికెట్ మ్యాచులు ఒక దానితో పోటీ పడి మరోటి ఇలా చాలా అడ్డంకులు ఎదురవుతుండడంతో సినిమా చూడటానికి ప్రేక్షకులు వస్తారా అని చిన్న సందేహంతో వాయిదా వేసినట్టుగా తెలుస్తోంది.